క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేత

శివకుమార్‌కు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఉదయభానురావు

నర్సింహులపేట, డిసెంబర్ 4 : పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 30న వరంగల్‌లో అండర్ 17 క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. దీనిలో మండలంలోని మోడల్ స్కూల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఔత్సాహిక క్రీడాకారుడు భూక్యా శివప్రసాద్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి మారినేని ఉదయభానురావు క్రీడా దుస్తులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతిభ చూపిన యువ క్రికెట్ క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఇలాంటి ఎంపిక పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అలాంటి క్రీడాకారులను ప్రోత్సహించడం క్రికెట్ అభిమానులుగా, క్రికెట్ సంఘం బాధ్యులుగా తమ కర్తవ్యమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు మరిన్ని పోటీలను నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం మాజీ సంయుక్త కార్యదర్శి బండారి ప్రభాకర్, జిల్లా క్రికెట్ సంఘం కార్యవర్గ సభ్యుడు మట్టెడ కుమార్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

- సులువైన పద్ధతితో వరి విత్తే విధానం
- పెట్టుబడి తక్కువ, ఎకరానికి 10 కిలోల విత్తనాలు సరి..
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు

డ్రమ్‌సీడర్‌తో అధిక లాభాలు

వంతడపలలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరినాట్లు వేస్తున్న రైతు

నర్సింహులపేట, డిసెంబర్ 4: కూలీల కొరత, పెట్టుబడి తగ్గించడంపై అన్నదాత దృష్టి సారించారు. ఇందులో భాగంగా డ్రమ్ సీడర్ విధానంతో వరి విత్తే పద్ధతిని అమలు చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీతో రైతులు కూడా యంత్రీకరణ సాగుకు ముందుకు వస్తున్నారు. సులువైన పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. డ్రమ్ సీడర్ విధానంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో వివిధ గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు రైతులు ఆధునిక డ్రమ్‌సీడర్ పద్ధతితో వరినాట్లు వేస్తున్నారు. మామూలుగానైతే 25 కిలోల విత్తనాలు నారు పోయాల్సి ఉంటుంది. నాటు కోసం పది మంది కూలీల వరకు అవసరం ఉంటుంది. కానీ డ్రమ్ సీడర్ ద్వారా నారు పోయాల్సిన అవసరం లేదు. ఎకరం పొలానికి 8 నుంచి 10 కిలోల విత్తనాలు మాత్రమే అవసరమవుతాయి.

విత్తనాలు విత్తుకునే పద్ధతి..

వరి విత్తనాలను ఒకరోజు నానబెట్టి మొలకలు రాకుండా చూసుకోవాలి. డ్రమ్స్ నుంచి విత్తనాలు బయటకు రావాలంటే మొలకలు రానివ్వకూడదు. సిద్ధం చేసిన మండులలో కూలీలు అవసరం లేకుండానే డ్రమ్‌ల్లో పోసేందుకు మోతాదు కోసం ఓ డబ్బాతో నానా బెట్టిన వరి విత్తనాలను పోసుకోవాలి. వరుస క్రమంలో డ్రమ్ ద్వారా పొలంలో పడుతాయి. వారం రోజుల వరకు మొలకల బయటకు వస్తాయి. డ్రమ్ సీడర్ ద్వారా వరి పంటను సాగు చేయడంలో మొలకలు దూరంగా పెరగంతో కలుపు తక్కువగా వస్తుంది. పంట కూడా 20 నుంచి 30 రోజుల ముందు రావడంతో పాటు దిగుబడి కూడా 10 బస్తాల వరకు ఎక్కువ వస్తుంది. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో యాసంగిలో 10వేల ఎకరాల్లో రైతులు డ్రమ్‌సీడర్‌తో సాగు చేస్తున్నట్లు వ్యవసాధికారులు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి

వరి నాటు ఖర్చుతో పాటు కలుపు తీసే అవకాశం లేకపోవడంతో నాటు కూలీ ఎకరానికి రూ.5వేలు, కలుపునకు రూ.4 వేలు ఖర్చు తగ్గుతుంది. ఎకరానికి 20 కిలోల విత్తనాలకు బదులు 10 కిలోల విత్తనం మాత్రమే అవసరం అవుతుండడంతో రైతులకు రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. దీనికి తోడు ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి అధికంగా వస్తుంది. ఒకసారి నాటు వేసే కూలీల ఖర్చుతో డ్రమ్ సీడ్‌ను కొనుగోలు చేసుకోవచ్చని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

తక్కువ సమయంలో ఎక్కువ లాభం

డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చు. దీనిద్వారా ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలు, పంట కాలంలో 20 నుంచి 30 రోజుల ముందే పంట చేతికి వస్తుంది. ఈ విధానంతో ఎకరానికి 10 బస్తాల ధ్యానం దిగుబడి ఎక్కువగా వస్తుంది. కలుపు సమయంలో తప్పనిసరిగా జాగ్రతలు పాటించాలి. డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగుపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

–రామకృష్ణ, ఇన్‌చార్జి ఏవో

అమ్మాయిలపై వివక్ష చూపొద్దు

జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు అరుణ

మాట్లాడుతున్న జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు అరుణ

నెల్లికుదురు, డిసెంబర్ 4 : అమ్మాయిలపై వివక్షత చూపకుండా తల్లిదండ్రులు అమ్మాయి, అబ్బాయి అనే భేదం లేకుండా ఇద్దరిని సమానంగా పెంచితే ఆడపిల్లలు వివక్షకు గురికాకుండా ఉంటారని జిల్లా మహిళాసాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు నలమాస అరుణ సూచించారు. మండలంలోని సంధ్యాతండాలో సోమవారం మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటి బచావో.. బేటీ పడావో 'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడ పిల్లలను అబ్బాయిలతో సమానంగా చదివించాలని వివరించారు. బాల్య వివాహాలు చేసి, వారి బంగారు భవిష్యత్‌ను పాడుచేయొద్దని లిపారు. బాల్య విహాలపై ఎలాంటి సలహాలు, సూచనలు కావాలన్నా హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100ను సంప్రదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉష, అంగన్‌వాడీ సభ్యులు, గర్భిణులు, బాలింతలు, సాధికారిత కేంద్ర స్టాఫ్ సంధ్యారాణి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థులు

పర్వతగిరి, డిసెంబర్ 4 : జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు కల్లెడ ఆర్డీఎఫ్ విద్యార్థులు 13 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ సోమవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించగా మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రికర్వ్ విభాగంలో ఆరుగురు, ఇండియన్ రౌండ్ విభాగంలో ఏడుగురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు ఈ నెల 8 నుంచి 12 వరకు గుజరాత్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఆర్చరీ కోచ్ చందూలాల్, జయదాస్, ఏవో యాకాంబ్రం, ఉపాధ్యాయులు అభినందించారు.

'మల్లికాంబ'లో ఉచిత వైద్య శిబిరం

వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న ప్రతిమ దవాఖాన వైద్యులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు ప్రతిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ తిప్పని అవినాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికాంబ ఆశ్రమంలో 15 ఏళ్ల నుంచి పిల్లలకు సేవ చేస్తున్న సిబ్బంది ఓదెమ్మకు క్యాన్సర్ వస్తే ఉచితంగా ప్రతిక్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నుంచి సర్జరీ, మందులు అందించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. మల్లికాంబ సంస్థకు కూడా తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు గైనకాలజిస్టు డాక్టర్ సుమిత, డెర్మటాలజిస్టు డాక్టర్ రమేశ్, డెంటిస్టు డాక్టర్ ప్రియాంక వైద్య పరీలు నిర్వహించి, మందులు అందజేశారు. చిన్నారులకు దవాఖానలో ఉచిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బండా రామలీల, ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోతన జయంతి

వరంగల్, డిసెంబర్ 4 : వరంగల్ ఏవీవీ కళాశాలలో పోతన జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ ప్రిన్సిపాల్ పీఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కలియుగ మానవుడు తరించిపోవాలంటే భాగవతమే ఏకైక సాధనమన్నారు. సముద్రాల శఠగోపాలాచార్యులు మాట్లాడుతూ భాగవతాన్ని పఠించి జ్ఞానాన్ని ఆర్జించాలని విద్యార్థులకు సూచించారు. ఆరు దశాబ్దాలుగా పోతన భాగవత పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్న ఏవీవీ విద్యాసంస్థలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, కరస్పాండెంట్ చందా విజయ్ కుమార్, శాశ్వత పాలక మండలి సభ్యుడు చందా శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్

చర్లపల్లి పాఠశాలను సందర్శించిన సీఎంవో రాధ

నడికూడ, డిసెంబర్ 4: మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను హనుమకొండ జిల్లా సీఎంవో(కమ్యూనికేషన్ మొబిలైజర్ ఆఫీసర్), ఐఈసీవో రాధ ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, స్కూల్‌లో ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో శ్రీ సాయి ట్రస్టు సాయంతో ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు హెచ్ ఎం అచ్చ సుదర్శన్ వారికి తెలిపారు. దీంతో రాధ వలంటీర్లకు నెల జీతం రూ.6వేలు అందించారు. విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. విజేందర్, విద్య వలంటీర్లు బాబురావు, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.